## హెచ్‌సీయూలో ఎంటెక్ స్పాట్ అడ్మిషన్లు

కొండాపూర్, జూలై 18: గచ్చిబౌలి లోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంటెక్‌లో పలు కోర్సులకు స్పాట్ రౌండ్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఎగ్జామినేషన్ విభాగం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. గేట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 26వ తేదీన వర్సిటీలోని ఎగ్జామినేషన్ విభాగంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. కాగా, పలు కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు http://acad.uohyd.ac.in/లో తెలుసుకోవచ్చన్నారు.

## నేడు జాతీయ సదస్సు

సిటీబ్యూరో, జూలై 18: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరగనున్నది. యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ వేదికగా ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్- రీసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ పాలసీ మేకింగ్ అంశంపై జాతీయస్థాయి సదస్సు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ ప్రక్రియ, అమలు విషయంలో పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లతోపాటు ఈ విధానంలో ఇమిడి ఉన్న విధానాలపై చర్చించనున్నారు. పర్యావరణ నిపుణులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటారని, ముఖ్య అతిథిగా అటవీ మంత్రి కొండా సురేఖ ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు.

## సీడీఎఫ్‌డీ ఆధ్వర్యంలో ఫెలోషిప్ ప్రోగ్రాం

సిటీబ్యూరో, జూలై18(నమస్తే తెలంగాణ): రీసెర్చ్ అసోసియేట్ ఫెలోషిప్‌కు సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ నోటిఫికేషన్ జారీ చేసింది. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారితో పాటు థీసెస్ సమర్పించిన వారు వీటికి అర్హులుగా ఆగస్టు 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఓ ప్రకటనలో తెలిపారు. మాలిక్యూలార్ మైక్రోబయాలజీ, సెల్ బయాలజీ, మాలిక్యూలార్ సిగ్నలింగ్, మమేలియన్ సెల్ సిగ్నలింగ్, జెనోమిక్ అనాలసిస్ అంశాలపై ఈ అవకాశం ఉందని, కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ అవకాశం కల్పిస్తున్నట్లుగా తెలిపారు.

మహేశ్వరం నియోజకవర్గం, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాలచెరువు సుందరీకరణ పనులను పర్యవేక్షిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో తదితరులు

## నాణ్యమైన వైద్య సేవలందించాలి

నాణ్యమైన వైద్య సేవలందించడంలో పోటీ పడాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్‌లోని నంది హిల్స్ బస్టాప్ వద్ద 'హాన్సి ఆర్థో అండ్ మెడికల్ కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్'ను ఎం.డి.శశిధర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్ లాల్, జిల్లెల నరేందర్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఎ.కామేశ్ రెడ్డి, ఆర్.నసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. *– జూబ్లీహిల్స్, జూలై 18*

## గచ్చిబౌలిలో ఇండియన్ బ్యాంక్ ఆర్‌ఏపీసీ-2 బ్రాంచ్

జూబ్లీహిల్స్, జూలై 18:ఇండియన్ బ్యాంక్ రిటైల్ అసెట్స్ ప్రాసెసింగ్ సెంటర్-2ను గురువారం నగరంలోని గచ్చిబౌలిలో ఆర్‌ఏపీసీ-2 బ్రాంచ్‌ను ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి.రాజేశ్వర రెడ్డి, జోనల్ మేనేజర్ సోమేపల్లి శ్రీనివాసరావు, ఇతర ఎగ్జిక్యూటివ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 100 మంది ఖాతాదారులకు గృహ, విద్య, వాహన రుణాల కింద రూ.49.30 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఇండియన్ బ్యాంక్ ఎఫ్‌వై-2024 కోసం రూ.12.21 లక్షల కోట్ల గ్లోబల్ బిజినెస్‌ను గత ఎఫ్‌వై 23 కంటే 12 శాతం వృద్ధితో నివేదించింది.

## అమ్మవారి యాత్రకు రూపావతి : మంత్రి

సిటీబ్యూరో, జూలై 18(నమస్తే తెలంగాణ): ఆషాఢ మాస బోనాలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి యాత్రకు రూపావతి(ఏనుగు) వచ్చిందని తెలిపారు. అమ్మవారి ఆశీర్వాదంతో ఏనుగు సేవలు కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 21న ఉజ్జయిని మహంకాళి, 28న లాల్ దర్వాజ సింహవాహిని బోనాలు ఘనంగా నిర్వహించాలని చెప్పారు. బోనాలకు సంబంధించి దేవాలయాలకు చెక్కుల పంపిణీ పూర్తయిందని, ఏమైనా మిగిలి ఉంటే సంబంధిత అధికారులు చెక్కుల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ వెంకటాచారి, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# బిల్లులు చెల్లించాలని రోడ్డెక్కిన కాంట్రాక్టర్లు

**హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా**

### పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లకు లక్షలు ఖర్చు

### బిల్లులు రాక తలలు పట్టుకున్న కాంట్రాక్టర్లు

ఖైరతాబాద్, జూలై 18: పార్లమెంట్ ఎన్నికల సమయంలో వివిధ ఏర్పాట్ల కోసం కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు లక్షలు పెట్టుబడులు పెట్టి చేతులు కాల్చుకున్నట్లు తెలుస్తున్నది. అప్పులు చేసి మరీ పోలింగ్ సిబ్బంది మొదలు, పోలీస్ సిబ్బంది వరకు ఆహారం, టెంట్లు, టేబుళ్లు, స్టేషనరీ, చివరకు వీడియోగ్రఫీ సైతం ఏర్పాట్లు చేశారు. ఇలా అధికారులు ఏది చెబితే అది సమకూర్చి.. వారు చెప్పిందల్లా చేసిన కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు రాక తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల కోడ్ పూర్తి కాగానే బిల్లు విడుదలవుతాయని, తమ కష్టాలు తీరుతాయని నమ్మి ఉన్నదంతా ఊడ్చి పెట్టారు. ఎన్నికల కోడ్ ముగిసి నెల రోజులు దాటినా ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువైంది. అధికారుల ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోకపోవడంతో చివరగా రోడ్డెక్కారు. గత శాసనసభ ఎన్నికల్లో పెట్టిన ఖర్చులు సగం మందికి మాత్రమే చెల్లించారని, మిగతా వారికి ఇంకా చెల్లించలేదని, ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఖర్చులు రూపాయి కూడా చెల్లించడంలేదని వాపోతున్నారు.

లడ్డీకాపూల్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

### పలువురు అధికారులకు వినతులు

తమ బిల్లులు చెల్లించాలంటూ గురువారం కాంట్రాక్టర్లు రోడ్డెక్కారు. లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్నికల కమిషన్ డబ్బులు విడుదల చేశామని చెబుతున్నా.. అధికారులు మాత్రం బిల్లులు చెల్లించడంలేదని వాపోయారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషనర్ కార్యాలయాలతోపాటు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రాలు సమర్పించామని కాంట్రాక్టర్లు సాయి నాథ్, నరేశ్, రాజు, అబ్దుల్ నదీమ్, శరత్, వెంకటేశ్ తెలిపారు.

### అడిగినవన్నీ సమకూర్చి..

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద పోలీసు సిబ్బందికి సంబంధించిన ఏర్పాట్లు( టెంట్లు, టేబుళ్లు.. తదితర సామగ్రి) పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద అధికారులకు ఆహారం, టీ, స్నాక్స్, టేబుళ్లు, కుర్చీలు లాంటి రకరకాల సర్వీసులను కాంట్రాక్టర్లే అందించారు. చివరకు స్టేషనరీ సైతం అధికారులు వీరిపైనే ఆధారపడ్డారు. ఒక్క జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ప్రతి శాసనసభ నియోజకవర్గంలో కనీసం రూ.40లక్షల చొప్పున బకాయిలు ఉన్నట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. అంటే ఒక్కో పార్లమెంట్ పరిధిలోని ఏడేసి నియోజకవర్గాలు ఉండగా, అంత మొత్తంలో ఖర్చు పెట్టామని కాంట్రాక్టర్లు చెప్పారు. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి చిన్న పనిని కూడా చిత్తశుద్ధితో చేశామని, ఎలాంటి ప్రశ్నలు వేయకుండా అడిగింది చేసి పెట్టామని, అలాంటి తమను ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేయడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అప్పుల పాలయ్యామని, తమ భవిష్యత్తు ఏంటో అర్థం కావడంలేదని కన్నీటి పర్యంతమయ్యారు.

మల్కారం గ్రామ రైతువేదికలో రైతు రుణమాఫీ టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శశాంక్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు

## రుణమాఫీతో రైతులకు మేలు

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్**

శంషాబాద్ రూరల్, జూలై 18 : రైతులకు ఆర్థిక ఇబ్బందులు తొలగించడంతోపాటు రైతులకు మేలు చేసేందుకే రుణమాఫీ చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్ష రూపాయల రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో లక్ష లోపు ఉన్న రుణాలను మాఫీ చేసినట్లు వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా రుణమాఫీని ప్రారంభించినట్లు తెలిపారు. గురువారం శంషాబాద్ మండలంలోని మల్కారం రైతువేదికలో ఏర్పాటు చేసిన టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ శశాంక్ పాల్గొని మాట్లాడారు. శంషాబాద్ మండలంలో 1,028 మందికి గాను రూ.4,89,37,225 మాఫీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నరేందర్, మల్కారం సహకార సంఘం చైర్మన్ బుర్కుంట సతీశ్, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, రాష్ట్ర పంచాయత్ రాజ్ సంఘటన చైర్మన్ రాచమల్ల సిద్ధేశ్వర్, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో మున్ని, వ్యవసాయశాఖ అధికారి కవిత, విస్తారణ అధికారి రాఘవేందర్, మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్, నవీన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సహకార సంఘం డైరక్టర్ దర్గా సత్తయ్య, జీవన్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

మల్కాజిగిరి, జూలై 18: ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్‌ను కలిసి ఎత్తు ప్రాంతాలైన దయానంద్‌నగర్, మల్లికార్జున్‌నగర్, గౌతంనగర్, హనుమాన్‌పేట్, ఏకలవ్యనగర్, అయ్యన్నగర్ ప్రాంతాల ప్రజలకు నీటి అవసరాల కోసం జీఎల్ఎస్ఆర్ రిజర్వాయర్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎత్తైన ప్రాంతాల్లో కాలనీల ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా గత ప్రభుత్వం రిజర్వాయర్‌ను మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజర్వాయర్ నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, అనిల్‌కిశోర్, రాము యాదవ్, ఉపేందర్‌రెడ్డి, అమీనుద్దిన్, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మా ఇల్లు కూల్చేందుకు కుట్ర

**దౌర్జన్యానికి పాల్పడుతున్న మాజీ కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలి**

**న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్న బాధితులు**

కోఠిలోని దేవిదీన్ బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు గాయత్రి ఆర్య తదితరులు

సుల్తాన్‌బజార్, జూలై 18: గత 70 ఏండ్లుగా ఆర్య సమాజ్‌కు చెందిన స్థలంలో అద్దెకు ఉంటున్న తమను ఇప్పటికిప్పుడు వెళ్లిపోవాలని తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్న ఓ మాజీ కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. గురువారం కోఠి హనుమాన్‌టేక్డీలోని దేవి దీన్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు గాయత్రి ఆర్య, బన్సీలాల్, అశోక్ అహుజా, రాఖేష్ శర్మ, నిధి పాండ్య, రిద్విజ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆర్య సమాజ్ కోసం పాటుపడుతూ తమ తాతల కాలం అనగా గత 70 ఏండ్లుగా 3 తరాలకు చెందిన వారు ఇక్కడ అద్దె చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా, సుల్తాన్‌బజార్ మాజీ కార్పొరేటర్ రామచంద్ర రాజు, తన అనుచరులతో కలిసి గత నెల 28వ తేదీన జీహెచ్‌ఎంసీ ఇచ్చిన నోటీసు పత్రాలను అతికించి ఫొటోలు దింపి తక్షణమే వాటిని తొలగించి మరుసటి రోజు అనగా.. జూన్ 29వ తేదీన ఎవరికి సమాచారం ఇవ్వకుండా తాము పనులకు వెళ్లిన సమయంలో మా ఇండ్లను జేసీబీతో దౌర్జన్యంగా కూల్చివేశారని వారు ఆరోపించారు. దీనికి తోడు జీహెచ్‌ఎంసీ అధికారులను సైతం తీసుకువచ్చి దౌర్జన్యానికి పాల్పడటం ఎంతవరకు సమంజసమని వారు మండిపడ్డారు. ఈ విషయాన్ని సుల్తాన్‌బజార్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. జీహెచ్‌ఎంసీ అధికారులను పోలీసులు అడ్డుకోవడం.. తగిన పత్రాలతో రావాలని సూచించడంతో వారు వెనుదిరిగారని వారు వివరించారు. తాము సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీకి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై తాము న్యాయ స్థానాన్ని ఆశ్రయించగా.. ఈనెల 26 వరకు న్యాయస్థానం స్టే ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. లేని పక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమని వారు వాపోయారు. మాజీ కార్పొరేటర్ అనుచరులతో తమకు ప్రాణహాని ఉందన్నారు. ఈ విషయమై మాజీ కార్పొరేటర్ రామచంద్రరాజు వివరణ కోరగా.. ఆ స్థలం ఆర్య సమాజ్‌కు చెందిందన్నారు. తాము నిబంధనలను అనుసరించే ముందుకు వెళుతున్నామన్నారు. ఆర్య సమాజ్‌కు చెందిన స్థలం కాబట్టి ఈ ప్రాంతంలో ఓ వేద పాఠశాల నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

## రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసిన అధికారులు

శంషాబాద్ రూరల్, జూలై 18 : రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. గురువారం శంషాబాద్ పట్టణంలోని మామిడిపల్లి మార్గంలో గత కొంతకాలం నుంచి రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు రహస్య ప్రదేశంలో దాచిన బియ్యంతో పాటు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. శంషాబాద్ పట్టణానికి చెందిన ఆర్ఫాజ్, ఇంతియాజ్ అనే ఇద్దరు వ్యక్తుల సాయంతో రేషన్ బియ్యాన్ని సేకరించి అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు తెలిపారు. గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఐదుగురు నిందితులపై పీడీయాక్టు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

## అక్రమ నిర్మాణాలు అరికట్టాలి



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

మల్కాజిగిరి, జూలై 18: మల్కాజిగిరి నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, కొత్తగా అభివృద్ధి పనులకు ప్రతిపాదలను ఆయన కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో అధికారుల ఉదాసీన వైఖరికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులపై నియంత్రణ కోల్పోయిందనడానికి అక్రమ కట్టడాలే కనిపిస్తున్నాయన్నారు. రోడ్డు, డ్రైనేజీ సౌకర్యం ఉన్న వాటికి అనుమతులు ఇవ్వాలని, లేని వాటికి కొత్తగా భవనాలకు అనుమతులివ్వడం వల్ల డ్రైనేజీ, తాగునీరు, రోడ్లులేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, ఉపేందర్ రెడ్డి, రాముయాదవ్, అమీనుద్దిన్, నరేందర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు మెరుగుపడాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

సిటీబ్యూరో, జూలై 18(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, ఉత్తీర్ణతలో మెరుగైన వృద్ధి ఉండేలా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతీ విద్యార్థి హాజరుశాతం ఫేషియల్ రికగ్నేషన్ సిస్టంలో నమోదు చేయాల్సిందిగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు. అందుకోసం జిల్లా విద్యాధికారి ప్రత్యేక తనిఖీలు చేయాల్సిందిగా సూచించారు. ప్రతీ మండలానికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ స్కూల్స్(డీఐఓఎస్) నిరంతరం పర్యవేక్షించేలా సూచలను చేశారు. మంచి ఫలితాలు సాధించేలా అవసరమైనవన్నీ సమకూర్చాలని, ప్రతీ పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా కలెక్టర్ లంగర్‌హౌస్‌లోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. అక్కడ ఉన్న వాటర్ ట్యాంక్, డ్రైనేజీ, ఎలక్ట్రిక్ పనులు, నల్లాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా నీళ్లు నిల్వకుండా చదును చేసి పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ఎప్పటికప్పుడు తనకు రిపోర్ట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రోహిణీ, డిప్యూటీ డీఈఓ రమణరావు, ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి పాల్గొన్నారు.

## పీఎంపీ, ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇవ్వాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం

**తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడు డాక్టర్ పి.కాళి ప్రసాదరావు**

సమావేశంలో మాట్లాడుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడు డాక్టర్ పి.కాళిప్రసాద్‌రావు, సెక్రటరీ డాక్టర్ జే.విజయ్‌రావు, కోశాధికారి డా. రాజేందర్‌కుమార్

సుల్తాన్ బజార్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం పీఎంపీ, ఆర్‌ఎంపీలకు కమ్యూనిటీ పారామెడిక్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రశాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని శాఖ అధ్యక్షుడు డాక్టర్ పి.కాళిప్రసాద్‌రావు పేర్కొన్నారు. గురువారం కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖ సెక్రటరీ డాక్టర్ జే.విజయ్‌రావు, కోశాధికారి డాక్టర్ రాజేందర్‌కుమార్ యాదవ్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలరాజు, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ యశ్వంత్‌రావు, డాక్టర్ గురువారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని ఏఎంఏ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం జీవో 428ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

## హెచ్‌ఐసీసీలో 20 నుంచి కమ్మ గ్లోబల్ సమ్మిట్

కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో హెచ్‌ఐసీసీ నోవాటెల్‌లో కమ్మ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.సమావేశంలో సుబ్బారావు, ఎం.భానుప్రసాద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. *– ఖైరతాబాద్, జూలై 18*

## తెలుగు ఇండియన్ ఐడల్ పోటీలు

తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహా, ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ హైదరాబాద్ సౌజన్యంతో గురువారం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్-3 పోటీదారులతో ఎలక్ట్రిఫైయింగ్ మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించారు. హైదరాబాద్ మెట్రో రైడర్స్‌ను అలరించేందుకు మెట్రోస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సంగీత కచేరి ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించింది. ఇండియన్ ఐడల్ సీజన్-3 పోటీదారుల ప్రదర్శనలతో వీక్షకులకు మరపురాని అనుభూతిని మిగిల్చాయి. పోటీదారులలో కేశవ్‌రామ్, రజినీశ్రీ, పూర్ణిమ, శ్రీధృతి, స్కంద, అనిరుధ్ ప్రధాన వేదికపై ఇచ్చిన ప్రదర్శనలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. దివా రజినీశ్రీ, పూర్ణిమ ప్రముఖ నటి సమంత వేషధారణలో ప్రేక్షకులను అబ్బురపరిచింది. *–జూబ్లీహిల్స్, జూలై 18*